ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబరు, 2025
5
శ్రీకాకుళం



నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు వేదిక రద్దు

డిఆర్ఒ వెంకటేశ్వరరావు



ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 20న నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల నమోదు కార్యక్రమం దీపావళి పండగ సందర్భంగా రద్దు చేశామని, ప్రజలు ఎవరూ ఈ కార్యక్రమానికి రారాదని జిల్లా రెవెన్యూ అధికారి మారెళ్ల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వారి స్థితి, దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా ఫోన్ చేయవచ్చని వివరించారు.

కాల్చకుండానే పేలుతున్నాయి...

- గతేడాది కంటే పెరిగిన బాణసంచా ధరలు
- ఆందోళనకు గురిచేస్తున్న వాతావరణం



ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన షాపులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దీపావళి వచ్చిందంటే చాలు చిన్నారుల నుంచి పెద్దలు వరకు ఒకటే సందడి. ఎంత ధరైనా బాణసంచా కొనుగోలు చేసి ఇంటిల్లపాదీ సంతోషంగా దీపావళి జరుపుకునేందుకు సిద్ధమవుతారు. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేస్తున్నారు. దీంతో దీపావళి టపాసులు కొనుగోలు చేయాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏకంగా అసలు ధరకు 40 నుంచి 50 శాతం పెంచి అమ్మకాలు జరుగుతుండటంతో ఇవే మీ ధరలు అంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విధంగా ధరలుంటే పండగ కూడా చేసుకోలేమని వాపోతున్నారు. ధరలు చూసి కొనుగోలు చేయకుండా వెళ్లిపోయిన వారు కూడా ఉన్నారంటే ధరల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాల్సిందే.

విశాఖ, ఒడిశా నుంచి కొనుగోలుదారుల రాకతో ఈ షాపులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇతర మండలాల నుంచి చిన్నచిన్న వ్యాపారులు సైతం ఇక్కడే కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో విక్రయాలు చేస్తుంటారు. కరోనా వ్యాప్తి తగ్గడంతో ఈ ఏడాది దీపావళి సందడి ఎక్కువగానే ఉంది. అయితే మందుగుండు సామగ్రి ధరలు మాత్రం టపాసుల్లా పేలుతున్నాయి. గతేడాది రూ.వెయ్యి పలికిన ఫ్యామిలీ ప్యాక్ ధర ఈ ఏడాది రూ.1,300 నుంచి రూ.1400కు పెరిగింది.

బ్రాండ్ పేరుతో లూటీ

బ్రాండ్ పేరు చెప్పి మరీ లూటీ చేసేస్తున్నారు. శివకాశి, ఊహన్, విఐపి క్రేకర్స్, రాజా ఏజెన్సీ వంటి కంపెనీలతో పాటు మరిన్ని కంపెనీల సామగ్రి ధరలు భారీగా పెరిగాయి. గతంలో వెయ్యి రూపాయలు పెడితే చిన్నాచితకా సామగ్రితో కలిపి పది, పదిహేను రకాల వస్తువులు వచ్చేవి. కానీ, నేడు ఆ మొత్తానికి సగం కూడా రాని పరిస్థితి నెలకొంది. శ్రీకాకుళంలో తక్కువ ధరకు బాణసంచా దొరుకుతుందని వచ్చిన వారంతా ధరలు చూసి బెంబేలెత్తి పోతున్నారు.

జిల్లాలో బాణసంచా దుకాణాల నిర్వహణకు అధికారుల అనుమతి ఇవ్వడంతో ఆదివారం నుంచి అమ్మకాల ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం నగరానికి సంబంధించి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో 21 దుకాణాలు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ప్రజలు కొనుగోళ్లకు బారులు తీరుతున్నారు.

అవుట్ పోస్టు ఏర్పాటు

వేలల్లో కొనేవాళ్లు గత కొన్ని రోజుల క్రితం విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న హోల్‌సేల్ దుకాణాల్లో కొనుగోలు చేశారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో మందుగుండు సామగ్రి షాపులను పోలీసులు అవుట్ పోస్టు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. అగ్నిమాపక శకటాన్ని అందుబాటులో ఉంచారు. ఫైర్ అండ్ సేఫ్టీ విధానంలో జాగ్రత్తలు తీసుకొని అమ్మకాల కొనసాగుతున్నాయి. ఆదివారం ముమ్మరంగా అమ్మకాలు కొనసాగించారు. తుపాను కారణంగా ఉదయం వర్షం పడటంతో వ్యాపారులు ఆందోళన చెందారు. తరువాత వర్షం అంతరాయం లేకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. మరో పక్క జిల్లాలో వంద షాపులకు అధికారులు అనుమతి మంజూరు చేశారు. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ సంబంధించి 62, పలాస రెవెన్యూ డివిజన్ సంబంధించి 21, టెక్కలి రెవెన్యూ డివిజన్ సంబంధించి 17 బాణసంచా దుకాణాలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు కొనుగోలుకు డిమాండ్ ఉంటుంది.

మరోపక్క మట్టి ప్రమిదలు, కొవ్వొత్తులు వంటి వాటికి సైతం డిమాండ్ కొనసాగుతుంది. బోదులు కాల్చేందుకు కట్టెలు, ఇతర సామగ్రి సైతం అమ్మకాలు జరుగుతున్నాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు కుటుంబ సభ్యులతో కలిపి ఉత్సాహంగా పండగ జరిపేందుకు సిద్ధమవుతున్నారు. మరోపక్క పండగ ప్రశాంతంగా, ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా జరుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. వదులు కాటన్ దుస్తులు ధరించడం, చెప్పులు వేసుకోవటం, సమీపంలో బకెట్‌తో నీరు అందుబాటులో ఉంచుకోవటం, సమస్య వస్తే వైద్యుని సంప్రదించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫైర్ సిబ్బంది సైతం అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు. ప్రజలు సేఫ్టీకి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. బాణసంచా పేల్చే సమయంలో కిరోసిన్, గ్యాస్ వంటివివి దూరంగా ఉండేలా చూడాలి. చేతితో పేలుడు పదార్థాలు పేల్చకూడదు. ఒక్కో సారి ప్రాణాలు మీదకు వచ్చే అవకాశం ఉంది. చాలా మంది ఇటీవల హరిత దీపావళి నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు మంచిది. అత్యవసర సమయాల్లో ఫైర్ నంబర్ 101కు ఫోన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు.



ఆలయ పూజారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకూర్మ క్షేత్రానికి మహర్దశ

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

గార: ప్రసిద్ధి చెందిన శ్రీకూర్మం ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆదివారం ఆలయాన్ని సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశీలించారు. పురాణ ప్రాశస్త్యత గురించి తెలుసుకున్నారు. పుష్కరిణి పరిసర ప్రాంతాలను ఎలా వృద్ధి చేయొచ్చో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. అవసరమైన సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకూర్మనాథ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. 7వ శతాబ్దానికి చెందిన ఏకైక పురాతన కూర్మనాథ ఆలయాన్ని మరింత వృద్ధి చేయాల్సిన అవశ్యకత ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి బోర్డు మెంబర్లు, స్థానికులు, జిల్లా అధికారులతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు స్పష్టం చేశారు. గోడలు, స్తంభాలు, కొన్ని చోట్ల విగ్రహాలను జీర్ణోద్ధారణ చేయాల్సిన పరిస్థితిని వివరించారు. శ్వేత పుష్కరిణీ, పిండ ప్రధాన ప్రాంతంలో భవనం, పార్కింగ్ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయాధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలను వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, పేదల సంక్షేమానికి వైసిపి ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మబగాంలో ఆదివారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులు ఉన్నత విద్య, వైద్యం పొందాలనే ఆశయంతో కొత్త మెడికల్ కళాశాలలను స్థాపించారని అన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, సంక్షేమ పథకాల రద్దుపై ప్రతి కార్యకర్తా ప్రజల్లోకి వెళ్లి చైతన్యం నింపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు డోల సాయి, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, మండల యూత్ అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు చింతాడ ఉమామహేశ్వరరావు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు బెలమాన గడ్డెయ్య పాల్గొన్నారు.

24న పాతపట్నంలో మెగా జాబ్‌మేళా

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 24న పాతపట్నంలోని కిరణ్మయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో డాక్టర్ రెడ్డీస్, హెట్రో, టాటా ఎలక్ట్రానిక్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, కియా మోటార్స్‌తో సహా మొత్తం 11 ప్రముఖ ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్‌ఎస్‌సి నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. దాదాపు 500కు పైగా ఖాళీలను భర్తీ చేయనున్న ఈ నియామకాల ద్వారా ఎంపికైన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, నెల్లూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఉదయం 9 గంటలకు మేళా ప్రాంగణానికి హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8317652552 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. నిరుద్యోగులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఉద్యోగుల్లో అసంతృప్తి



ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో బేటీ వారిలో అసంతృప్తి వ్యక్తం చోటుచేసుకుంది. ఉద్యోగులకు బకాయిపడిన డిఎలు మంజూరు, పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు వంటి ఆర్థిక పరమైన లావేదేవీలపై ప్రభుత్వం వ్యవహరించిన ఉదాసీన వైఖరిశైలి ఉద్యోగ సంఘాలకు, ఉద్యోగులకు మింగుడుపడడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులపై కినుక వహించిన ప్రభుత్వ వైఖరిపై వారు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు బకాయిపడిన 4 డిఎల్లో కనీసం రెండు డిఎలైనా మంజూరు చేస్తూ... పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు చేస్తామని చెబుతూ ఐఆర్ ప్రకటిస్తారేమో అని ఉద్యోగులు ఆశించారు. కానీ, ఆవేమీ లేకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోవాలని చెబుతూ అర్థం చేసుకోవాలని చెబుతూ ఒక్క డిఎ మంజురు చేస్తూ... కంటితుడుపు చర్యగా ప్రభుత్వం వ్యవహరించడంపై ఉద్యోగులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒక్క డిఎ ఉద్యోగులకు ఇస్తే బడ్జెట్‌లో నష్టపోతామని చెబుతున్న ప్రభుత్వం వృథా ఖర్చుల కోసం ఎంత వెచ్చించిందో తెలుసుకోలేదా? అని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు వేల కోట్ల రూపాయలు బకాయిపడ్డారు. వాటిపైనా కనీసం ప్రస్తావించకపోవడంపై ప్రభుత్వ ఉదాసీన వైఖరిపై మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘ నాయకులతో చర్చించి శుభపరిణామంగా భావిస్తునే ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించకపోవడంపై ఉద్యోగులు అసంతృతో ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఒక్క డిఎ మంజురు చేస్తూ... తీసుకున్న నిర్ణయం అన్యాయమని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య అన్నారు. ఉద్యోగులతో నిర్వహించిన చర్చలు శుభ ఫలితాలను అందివ్వలేమని అన్నారు. కనీసం 2 డిఎలు కూడా ఇచ్చుకొలేని దుర్మార్గమైన పరిస్థితిలో ప్రభుత్వం ఉందని చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఒక్క డిఎ ప్రభుత్వం ప్రకటించడం కంటితుడుపు చర్య అని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పేడాడ కృష్ణారావు అన్నారు. మధ్యంతర భృతి ప్రకటించకుండా మూడేళ్లుగా ఉద్యోగులకు సంపాదిత సెలవుల డబ్బులు చెల్లించకుండా ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పడం హస్యాస్పదంగా ఉందని అన్నారు.

పట్టణ పేదరిక నిర్మూలనే లక్ష్యం

- మహిళలను సంఘాల్లో చేరేలా ప్రోత్సాహం
- అర్హత, సీనియార్టీ మేరకు రుణాలు అందజేత
- మెప్మా పీడీ ఎస్.వెంకటరావు





ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలో దారిద్ర రేఖకుదిగొనున్న మహిళ ఆర్థిక ప్రగతే లక్ష్యమని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదలవలస, పలాస కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో స్వయం సహాయ సంఘాల మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ లక్ష్యాలకు లోబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు విషయాలు వెల్లడించారు.

? స్వయం సహాయ సంఘాల సభ్యుల సంఖ్య ఎంత?

ఆముదాలవలసలో 749 సంఘాలు 7751 సభ్యులు, పలాస-కాశీబుగ్గలో 1217 సంఘాలు 12,286 సభ్యులు, ఇచ్ఛాపురంలో 816 సంఘాలు, 8472 సభ్యులు, శ్రీకాకుళం నగరపాలక సంస్థలో 2977 సంఘాలు 29915 సభ్యులు ఉన్నారు.

? సంఘాలకు అందజేసి రుణాలు ఏ విధంగా ఉన్నాయి?

అందజేసిన రుణాలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటివరకు.. ఆముదాలవలసలో 111 సంఘాలకు రూ.15. 55 కోట్లు, పలాస-కాశీబుగ్గలో 343 సంఘాలకు రూ.50.27 కోట్లు, ఇచ్ఛాపురంలో 268 సంఘాలకు రూ. 30.89 కోట్లు శ్రీకాకుళంలో 458 సంఘాలకు రూ.62.35 కోట్లు అందజేశాం. అర్హత, సీనియార్టీ మేరకు రుణాల అందజేస్తున్నాం.

? మహిళల ప్రగతికి తీసుకొంటున్న చర్యలు?

బ్యాంకు రుణాలు, సంఘం, సమాఖ్యల ద్వారా అంతర్గత రుణాలు, వ్యక్తిగత సంఘ సమిష్టి స్వయం ఉపాధి రుణాలు, ముద్ర, పిఎంఇజిపి, సిజిటిఎంఎస్ఇ, పిఎంఎఫ్ఇ రుణాల సౌకర్యాల కల్పన.. ముఖ్యంగా వీధివ్యాపారుల అభివృద్ధికి పిఎం స్వానిది రుణాలు అందజేస్తున్నాం. మహిళల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ లక్ష్యాలకు కనుగొనంగా మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తున్నాం.

? మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలు, జీవనోపాధులకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

పాన్‌షాప్, కిరాణా, లేడీస్ కార్నర్, బ్యూటీ పార్లర్, మెడికల్ షాప్, చిరు తిల్లు వ్యాపారం, ఫాస్ట్‌ఫుడ్, ఒన్ గ్రామ్ గోల్డ్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, పేపర్ ప్లేట్స్ తయారీ, ఫ్యాన్సీ, గిఫ్ట్ షాప్‌లు, స్వీట్స్ తయారీ, ఫినాయిల్ తయారీ యూనిట్లు, కూరగాయలు, పండ్లు, పూలు, ఐరన్ హార్డ్ వేర్ వంటి వ్యాపారాలు శానిటరీ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, టైలరింగ్ యూనిట్లు తదితర జీవనోపాదుల వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాం. అవసరమైతే ఈ అంశాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చి రాణించేలా చర్యలు తీసుకుంటున్నాం.

? మెప్మా ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏమిటి?

బ్యాంకుల ద్వారా ఎటువంటి షూరిటీ లేకుండా రూ.20 లక్షల వరకు రుణాలు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత వివిధ పథకాల ద్వారా రూ.50 వేల నుంచి రూ.50 లక్షల వరకు రుణ సౌకర్యం, వడ్డీ రాయితీ పథకాలు అమలు చేస్తున్నాం. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశల కల్పన, సఖిసురక్ష ప్రత్యేక కార్యక్రమాతో 35 సంవత్సరాల పైబడిన మహిళల్లో ఆరోగ్య భద్రత పెంపునకు శ్రీకారం చుట్టాం. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నాం.

? పేదరిక నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు?

అర్హత కలిగిన మహిళలను క్షేత్ర స్థాయిలో గుర్తించి స్వయం సహాయక సంఘాలలో చేరేలా ప్రోత్సాహించడం, సంఘాల్లోని మహిళా సభ్యుల కుటుంబాల్లో ఉన్న పురుషులకు రవాణా, పారిశుధ్య, డోమెస్టిక్ వర్కర్లు, సేవారంగ, గిగ్ వర్కర్లు (డెలివరీ బాయ్స్) విభాగాల్లో గ్రూపులుగా ప్రోత్సాహస్తూ... ఆర్థిక చేకూర్పు అందించే చర్యలు తీసుకుంటున్నాం. బిలో పవర్ టి లైన్ కుటుంబాల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక ప్రగతి సాధిస్తారు.

మీ త్యాగం అజరామరం



తమ కోసం బతికేవాడు కాదు.. పది మంది కోసం ప్రాణాలర్పించే వాడే నిజమైన అమరుడు..! విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్క చేయక, ప్రజల భద్రత కోసం అహర్నిశలూ శ్రమించే వాడే జవాను. తీవ్రవాదులు పెచ్చరిల్లినా.. ముష్కరులు విరుచుకుపడినా.. శత్రు దేశాలు దండెత్తినా.. మడమ తిప్పక పోరాడే రక్షక భటునికి సలాం చేయాల్సిందే. అలా పలు పోరాటాల్లో అశువులు బాసిన జిల్లాకు చెందిన పలువురు అమరవీరులను స్మరించుకుంటూ ప్రత్యేక కథనం. - ప్రజాశక్తి, శ్రీకాకుళం

సంస్మరణ దినోత్సవం ఆవిర్భవించిందిలా..

1959 సంవత్సరం అక్టోబరు 21న భారత్- చైనాల మధ్య సియాచిన్ సరిహద్దులో లడక్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న మన జవాన్లపై చైనా జవాన్లు దాడి చేయడంతో పది మంది అమర వీరులయ్యారు. నాటి నుంచి ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరపుకోవడం ఆనవాయితీగా మారింది.

రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

పేదింట పుట్టి...



పొందూరు మండలంలోని లోలుగు గ్రామంలో 1976 ఏప్రిల్ 15న మజ్జి చిన్నవాడు దంపతులకు ఎస్.వి రమణ జన్మించాడు. వారిది నిరుపేద కుటుంబం. 1998 సంవత్సరం సెప్టెంబరు ఒకటో తేదీన కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి, స్పెషల్ పార్టీలో చురుకైన విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. నులకజోడు గ్రామంలో సుమారు 200 మంది నక్సలైట్లు రైసు మిల్లులో దోపిడీ చేసి బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లిపోయారు. దానిపై కూంబింగ్‌కు వెళ్లిన స్పెషల్ పార్టీకి చేదు అనుభవం ఎదురైంది. 2001 సంవత్సరం అక్టోబరు 27న నడిమి గూడ వద్ద నక్సల్స్ అమర్చిన మందుపాతర పేలి వెంకటరమణ మృతిచెందాడు.

నక్సలైట్ల వేటలో...



జిల్లా చరిత్రలో తొలిసారిగా 1992 సంవత్సరంలో నక్సల్స్ ఘాతకానికి ఎస్ఐ బంగారు నాయుడు బలయ్యాడు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుణుపూరుపేటకు చెందిన ఆయన బారువా, కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో పనిచేశారు. మందస మండలం రట్టి, బేతాళపురం గ్రామాల మధ్య కొండల్లో నక్సలైట్లు ఉన్నారనే సమాచారం రావడంతో అక్కడకు వెళ్లారు. మార్చి 23వ తేదీన ఉద్దానం దళానికి చెందిన నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు.

సమాచార సేకరణలో దిట్ట



నక్సలైట్ల సమాచార సేకరణలో దిట్టగా పేరుగాంచిన నరేంద్రదాసు, వారి ఉద్యమాలను నీరుగార్చేందుకు విశేషమైన కృషి చేసేవాడు. నక్సలైట్ల కదలికలను గమనించి, వారి ఆకృత్యాలను నిరోధించడంలో దాసు సఫలమవుతుండటాన్ని నక్సల్స్ సహించలేకపోయారు. 1997 మార్చి 17వ తేదీన కాశాబుగ్గలో దైవదర్శనానికి వెళ్లిన దాసును పిస్టోల్‌తో కాల్చి చంపారు. 1971లో పోలీసుశాఖలో చేరిన దాసు స్పెషల్ బ్రాంచి ఇంటెలిజెన్స్ విభాగాల్లో సమర్థవంతమైన సేవలు అందించారు.

రక్షణ కల్పిస్తూ ప్రాణాలు వదిలి..



పలాస మండలం నీలిభద్రలో ఒక వ్యక్తిని హతమార్చి, ఆస్తిని దోచుకునేందుకు నక్సలైట్లు ప్రణాళిక వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయనను రక్షించేందుకు ఇంటి వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. దానికి ఇన్‌ఛార్జిగా హెడ్‌కానిస్టేబుల్‌గా అన్నెపు పాపారావు వ్యవహరించారు. 1997 జూలై 17వ తేదీ అర్ధరాత్రి తుపాకీలతో నక్సలైట్లు విరుచుకుపడ్డారు. పాపారావు ఎదురుకాల్పులు జరిపి, వీరోచితంగా పోరాడాడు. నక్సల్స్ తూటాలకు నేలకొరిగాడు. 1971 పోలీసు శాఖలో పాపారావు సర్వీసు ప్రారంభించారు. 1948లో ఫిబ్రవరి 9వ తేదిన కోటబొమ్మాళి మండలం జర్జంగిలో జన్మించారు.


దారికాచి మట్టుబెట్టారు



నక్సలైట్ల కార్యకలాపాల సమాచార సేకరణలో ఆరితేరిన కృష్ణమూర్తిని దారికాచి మట్టుపెట్టారు. 1970 మార్చి 15న సంతకవిటి మండలం వాల్తేరులో పి.బోడయ్య దంపతులకు కృష్ణమూర్తి జన్మించాడు. 1993లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరాడు. నక్సలైట్ల ఏరివేతలో చురుకైన పాత్ర పోషిస్తూ శాంతి భద్రతలను పరిరక్షించేవాడు. దీన్ని జీర్ణించుకోలేని నక్సలైట్లు మాటువేసి కాల్చి చంపారు. 2000 సంవత్సరం జూన్ 5న మందస మండలం, హరిపురం కూడలిలో ఈ ఘాతుకం చోటుచేసుకుంది.

రేపట్నుంచి స్మారకోత్సవాలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా నిర్వహించే పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు మంగళవారం నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుందని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను, త్యాగాలను కొనియాడుతూ ఈ స్మారకోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధమయ్యిందన్నారు. ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిల్లో ఈ స్మారకోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసును గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల కీలకమైన పాత్ర, విధులు, త్యాగాలు గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమన్నారు.

కార్యక్రమాల వివరాలు

21న అమరవీరుల సంస్మరణ దినం. ఆ రోజు ఉదయం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమర వీరుల స్థూపం వద్ద సంస్మరణ దినం ఘనంగా నిర్వహించనున్నారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు, తదితర అసాంఘిక శక్తులతో పోరాటమే గాక విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ నివాళ్లర్పించనున్నారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఎచ్చెర్లలోని పోలీసు కళ్యాణ మండపంలో పోలీసులు ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ ప్రదర్శన నిర్వహించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన చేయనున్నారు. అలాగే సబ్ డివిజన్/సర్కిల్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్ల స్థాయిలోనూ ఓపెన్ హౌస్ నిర్వహణ జరుగుతుంది.

స్వగ్రామాల సందర్శన

ఈ నెల 22 నుంచి 30 మధ్యలో జిల్లాలోని పోలీసు అమర వీరుల గ్రామాల సందర్శన... వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అమరలైన పోలీస్ సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ జ్ఞాపికలను అందజేస్తారు. అమర వీరుల సేవలను వివరించడం. డిఎస్‌పి స్థాయి పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమర వీరుల గ్రామాలు/పట్టణాలు సందర్శించనున్నారు.

దీపావళి శుభాకాంక్షలు


మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: దీపావళి పండగ ప్రతి కుటుంబానికీ ఆనందం, ఐకమత్యం, సంతోషం నింపాలని, జిల్లా ప్రజలందరికీ దీపావళి పండగ సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీపావళి ప్రతి ఇంటికీ వెలుగు మాత్రమే కాదు, ఆశ, అభివృద్ధి, సంక్షేమం కూడా తీసుకురావాలి. రాష్ట్రంలో మరోసారి వెలుగులా ప్రకాశించడానికి సిఎం నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, కూటమి ప్రభుత్వ కృషి పునాది అవుతుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ఈ ప్రభుత్వానికి ధ్యేయమని, ప్రతి నిర్ణయమూ ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటున్నామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 38 ఏళ్ల తర్వాత కాలవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేశారు. కాగా, ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విశ్రాంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతకు అభినందనలు


అభినందిస్తున్న ఐసిసి క్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: జిల్లాస్థాయి హరకేశవ మెమోరియల్ టికెట్ టోర్నమెంట్ విజేత ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులను ఐసిసి క్రికెట్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం అభినందించారు. జిల్లా కేంద్రంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యాన స్కూల్ లెవెల్ 26 జట్లు పాల్గొన్నాయి. హరకేశవ మెమోరియల్ టోర్నీలో విజేతగా పురుషోత్తపురం ఎపిడి మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఐసిసి గౌరవాధ్యక్షులు దాసరి రాజు, ముఖ్య సహాయకులు బత్తుల వెంకటరమణ, డాక్టర్ మట్ట శ్రీనివాస్, ఎలియన్స్ క్లబ్ అధ్యక్షులు మూర్తి, చాట్ల లోహిదాస్, సాలిన గణేష్, దక్కత. విశ్వనాథం, వెంకటరమణ మాస్టారు, దట్టి బాలయ్య, ఐసిసి కోచ్ గోపి, మోడల్ స్కూల్ కెప్టెన్ చేతన్ పాల్గొన్నారు.

ఎడికి సన్మానం


మధుబాబును సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బదిలీపై వెళ్లిన పలాస వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లింగాల వెంకట మధుబాబును ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఎఒ దానకర్ణుడు ఆధ్వర్యాన ఎడికి సచివాలయాల వ్యవసాయ అధికారులు దుశ్శాలువ కప్పి సత్కరించారు. వ్యవసాయ శాఖలో ఆయన సేవలను గుర్తించిన అధికారులు, సిబ్బంది, రైతులు అభినందనలు తెలిపారు. ఎడి మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలో పలాసలో గడిపిన కాలం ఎంతో సంతృప్తికరంగా ఉందని అన్నారు. రైతుల అభివృద్ధికి సహాయపడే అవకాశాన్ని ఇచ్చినందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఇఒలు ప్రభావతి, సుమంత్, విఎఒలు శరత్ కుమార్‌రెడ్డి, సూర్య, త్రినాథ్ పాల్గొన్నారు.

2న కళాకారుల వన భోజనం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నవంబర్ 2 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మున్సిపాలిటీలోని 4వ వార్డు పరిధిలోని గేదెలవానిపేట తోటలో కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించు వనభోజనాలకు కళాకారులు, కళాపోషకులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కళాకారుల సంఘం అధ్యక్షుడు పేడాడ ధనుంజయరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ కళాకారులంతా వన భోజనాలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు, దాస్యం లక్ష్మణరావు, రామారావు, ఎన్.చంద్రశేఖరరావు, పివిఎన్ మాస్టారు, ఎం.ఈశ్వరరావు, బి.గోవిందరావు, కె. రాములు నాయుడు, పిడి కిరణ్ కుమార్, జి.జోగారావు, సిహెచ్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిఎ విడుదలపై హర్షం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డిఎను విడుదల చేయడం, 60 రోజుల్లో హెల్త్‌కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించే ందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్‌టిసి ఉద్యోగుల ప్రమోషన్‌లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని సిఎం ప్రకటించడంపై ఎపి ఎన్‌జిఒ, ఎపి జెఎసి జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దష్టి సారించడం, దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ స్థాయిలో జరగడం సంతోషదాయకమన్నారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని పెంచడం, ఆరోగ్యశ్రీ విధానాన్ని ఇన్సూరెన్స్ మోడల్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలని కమిటీకి ఆదేశించడం హర్షణీయమన్నారు. దీపావళికి ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి, ఆ సమావేశాన్ని సాధించగలిగిన ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ , శ్రీకాకుళం జిల్లా ఉద్యోగ సంఘాల తరపున అభినందనలు తెలిపారు. మిగతా అన్ని అంశాల పరిష్కారం కోసం రాష్ట్ర కార్యవర్గం ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్, ఎపి జెఎసి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య శాఖ మంత్రి సత్య కుమార్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, చీఫ్ సెక్రటరీ కె.. విజయానంద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మారుతున్న నేతలు.. పూర్తికాని రహదారులు

- అర్ధాంతరంగా ఆగిన రహదారి పనులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- గిరిజనులకు తప్పని అవస్థలు

ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నా గిరిజన గ్రామాల రహదారులు మాత్రం పూర్తికావడం లేదు. కోట్ల వ్యయం చేశాం. సౌకర్యాలు కల్పించామని ఎంతో దంభికంగా ప్రకటనలు గుప్పిస్తున్న పాలకవర్గం, అవి ఎంతవరకు కార్యరూపం దాల్చిందో కనీసం పరిశీలన చేపట్టకపోవడం విడ్డూరంగా ఉంది. దీంతో ఆ గ్రామాలకు కష్టాలు తీరడం లేదు.

ప్రజాశక్తి- బూర్జ

ఆ గిరిజన గ్రామాల ప్రజలకు నడక కష్టాలు తప్పడం లేదు. దశాబ్దాల కాలంగా అను నిత్యం నడక యాతనతో సతమతమవుతున్నారు. దూరంగా కొండల మధ్యలో నివాసం ఉంటున్న తమకు రహదారి సౌకర్యం కరువైందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి పాలకులు వచ్చిన సందర్భంలో తమకు రహదారి కావాలని పలుమార్లు విన్నవించుకోవడంతో, దీనిపై స్పందించిన గత వైసిపి ప్రభుత్వం పక్కా రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ రూ. 2 కోట్లు నిధులను మంజూరు చేసింది.

ఆర్భాటంగా శంకుస్థాపన

మండలం మదనాపురం, సరుబుజ్జిలి రోడ్డు నుంచి వయా మశానపుట్టి గ్రామ రహదారి నిర్మాణం కొరకు


రాళ్లు తేలిన గిరిజన గ్రామ రహదారి

2021లో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారని, నేటికి ఐదేళ్లు అవుతున్నప్పటికీ రహదారి నిర్మాణం పనులు అతీగతీ లేకుండాపోయిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని అవస్థలు

బిటి రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా గుత్తేదారు కేవలం రాళ్లుకుప్పలు మాత్రమే వేసి విడిచిపెట్టడంతో అర్ధాంతరంగా రహదారి పనులు నిలిచిపోయాయని గిరిజనులు వాపోతున్నారు. మట్టి రోడ్డు అయినా సరే సౌకర్యంగా ఉండేదని, కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు అన్న చందంగా రహదారి నడిచేందుకు వీలు లేకుండా పోయిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అత్యవసర సమయంలో ఎటువంటి వాహనాలు కూడా రానిపరిస్థితి ఏర్పడిందని, కనీసం నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమిలోనూ షరా మామూలే

కూటమి ప్రభుత్వంలోనైనా తమ రహదారి కష్టాలు తీరుతాయని ఎంతో ఆశగా ఎదురుచూశామని అయినప్పటికీ నిరాశే ఎదురవుతుందని గిరిజనులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లామని, అయినప్పటికీ ఫలితం శూన్యమని వాపోయారు. రహదారి పూర్తి చేయాలని అటు పాలకవర్గంతో పాటు ఐటిడిఎ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కొరువయ్యాడని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా


అర్ధాంతరంగా నిలిచిన మశానపుట్టి రహదారి

ప్రతినిధులు స్పందించి రహదారి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జాడ లేని అధికారులు

ఇదే విషయాన్ని సంబంధిత అధికారుల వివరణ కొరకు ప్రజాశక్తి పలుమార్లు ఫోన్‌లో ప్రయత్నం చేయగా అధికారులు స్పందించకపోవడం విశేషం.

రహదారిని పూర్తి చేయాలి



గత ఐదేళ్లుగా రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నాం. అధికారులు జాడలేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- సవర రాణి, జంగాలపాడు

అధికారులు పట్టించుకోవాలి



అర్ధాంతరంగా రహదారి పనులు నిలిపివేశారు. నేటికి ఐదేళ్లుగడుస్తున్న ప్పటికీ అధికారులు చోద్యం చూస్తు న్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకునే నాథుడే కొరవయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలి.

- సవర ప్రతిమ, మశానపుట్టి


వెండి బిందెలను అందుకుంటున్న ఇఒ

అరసవల్లి ఆదాయం రూ.3.41 లక్షలు

అరసవల్లి: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆదాయం ఆది వారం రూ.3 లక్షల 41 వేల 221 వచ్చినట్లు ఆలయ ఇఒ కెఎన్‌విడివి ప్రసాద్ తెలిపారు. టికెట్లు విక్రయం ద్వారా రూ.79,500, పూజలు, విరాళాల రూపంలో రూ.1,23, 446, ప్రసాద విక్రయం ద్వారా రూ.1,38,275 ఆదాయం వచ్చిందని తెలిపారు. అలాగే ఫిరంగిపురానికి చెందిన కేశవ రావు, ఉమా మహేశ్వర రావులు కేజీ 888 గ్రాముల విలువ చేసిన మూడు వెండి బిందెలు వితరణగా సమర్పించారు.


అవార్డును అందుకుంటున్న రాజు

సేవలతోనే గుర్తింపు

బూర్జ: మండలంలో చీడివలస గ్రామానికి చెందిన బొడ్డే రాజు గత 15 నెలలుగా విద్యారంగంలో అనేక సేవలందించి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుండడంతో రాజుకు సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజర్ మదర్‌థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుబ్రహ్మ రాష్ట్ర అవార్డును ఆదివారం విశాఖపట్నంలో అందజేశారు. అలాగే సర్వేపల్లి రాధాకృష్ణ గురుదేవోభవ అవార్డు, డాక్టర్ అబ్దుల్ కలాం విద్య జాతీయ అవార్డుకు ఎంపికవ్వడంతో మండలంలోని విద్యవంతులు అభినందించారు. మరిన్ని సేవలు విద్యార్థులకు అందించి మరిన్ని అవార్డులను అందుకోవాలని వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, సర్పంచ్ శ్రీరామ్మూర్తి ఆకాంక్షించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నరసన్నపేట: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే విద్యలో రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చునని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆదివారం సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా మండల స్థాయి సభ్యులు పాల్గొన్నారు.

అనుకోని ప్రమాదం... ఆపదలో కుటుంబం

ప్రజాశక్తి- కవిటి

అనుకోని ప్రమాదం ఆ కుటుంబాన్ని ఆపదలోకి నెట్టింది. ప్రశాంతంగా సాగిపోతున్న వారి జీవితానికి రోడ్డు ప్రమాదం ఆస్పత్రి పాలుచేసింది. రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెబితే మేస్త్రీ పనిచేస్తూ జీవిస్తున్న ఆ కుటుంబం దయనీయ స్థితిలో దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. వివరాల్లోని వెళ్తే... మండలంలోని పొందూరుపుట్టుగకు చెందిన దూగాన రామ్మూర్తి(44) మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి సోంపేటలో పని ముగించుకుని కుమారుడు ప్రణయ్‌తో పాటు ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగివస్తుండగా కంచిలి మండలం కొజ్జిరియా జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. వీరి వైద్యం కోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని


చికిత్స పొందుతున్న తండ్రీ కొడుకులు

వైద్యులు తెలిపారు. దీంతో స్నేహితులు, సన్నిహితులు సహకారంతో ఇప్పటి వరకూ సుమారు రూ.4 లక్షలు బాధితులకు అందాయి. అయితే ఇప్పటికీ ఐసియులో ఉన్న ఆ తండ్రీ కొడుకుల చికిత్సకు మరో రూ.6 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో రామ్మూర్తి భార్య లలిత దాతల సహాయం కోసం ఎదురుచూస్తోంది. ఆపదలో ఉన్న తన కుటుంబాన్ని ఆదుకోవాలని దీనంగా అర్థిస్తోంది. దాతలు స్పందించి ఫోన్ పే నంబరు 9492298940కు ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటోంది.

మనువాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి

ప్రజాశక్తి- మందస

ప్రజా సంఘాలన్నీ ఐక్యమత్యంగా మనువాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి రైల్వే యూనియన్ కార్యాలయంలో సంఘం నాయకులు పిట్ట గీతారాణి అధ్యక్షతన మామిడి కోందండరావు రచించిన 'వర్తమానం నుంచి గతం వైపు' అనే పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాన్ని, అభివృద్ధిని అడ్డుకొని బ్రాహ్మణాదిక్య సమాజ నిర్మాణానికి బిజెపి అడుగులు వేస్తోందని అన్నారు. మనువాదాన్ని ఓడించకపోతే భవిష్యత్ లేదని రచయిత మామిడి కోదండరావు చేసిన విశ్లేషణ నేటి సమాజానికి అద్దం పడుతోందన్నారు. విద్యార్థులు, యువజనలు సమాజ ప్రేమికులు ఈ పుస్తకాన్ని అధ్యనయం చేయాలని


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దానేష్

పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుచ్చ దుర్యోధన, సాలిన వీరాస్వామి, కోర్నాన ఉమాపతి, తెప్ప పాపారావు, పిట్ట జోగారావు, పిలక కృష్ణారావు, తుంగాన శంకరరావు, మట్ట జీవన్‌బాబు, మామిడి గణపతి, నగిరి కరుణాకర్, దుర్యోధన, నాగమణి, వై.భార్గవ్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ క్లయిమ్ అందజేత


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సైనిక ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లుకలాం గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి బొత్స శ్రీరాములు ప్రమాదవశాత్తు మరణించారు. ఈ కుటుంబానికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ రూ.50 లక్షలు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అందజేసింది. నగరంలోని సైనిక సంక్షేమ కార్యాలయంలో ఆదివారం నరసన్నపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసోసియేట్ కోమలిని మాజీ సైనికు ఉద్యోగులు సన్మానించారు. జిల్లా సైనికోద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పూర్ణచంద్రరావు బ్యాంకు ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రమాద బీమాను పక్కాగా అమలు చేసిన బ్యాంక్ అధికారులకు మాజీ సైనిక ఉద్యోగులు సన్మానం చేసి అభినందించారు. ఈనెల 26న మాజీ సైనిక్ ఉద్యోగుల ఫ్యామిలీ పిక్నిక్ ఏర్పాటు చేసి, సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు, సమస్యలపై చర్చించనున్నట్లు మాజీ సైనిక్ ఉద్యోగుల యూనియన్ సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో సర్వీస్ మెన్‌లు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

నృత్యప్రదర్శనలో అలరించిన శ్రీహర్షిత


అరసవల్లి : హర్షితను సత్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- అరసవల్లి

పద్మ భూషణ్ డా. వెంపటి చినసత్యం జయంతి సందర్భంగా కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామంలో సిద్ధేంద్ర యోగి కళా పీఠంలో కూచిపూడి దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నృత్యదర్శకులు తమ శిష్య బృందంతో పాల్గొన్నారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన శ్రీ అభయనృత్య నికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు నీరాజా సుబ్రహ్మణ్యం శిష్యురాలు కుంబారు శ్రీ హర్షిత పాల్గొని నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు కూచిపూడి అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్ధేంద్ర యోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపాల్ డా.చింత రవిబాలకృష్ణ, డా.ఏలేశ్వరపు శ్రీనివాసులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధే శ్యామ్, డా.పసుమర్తి శ్రీనివాస్ శర్మ, స్టేట్ కోఆర్డినేటర్ ఘంటసాల పవన్‌కుమార్, రమణకుమారి, బాలత్రిపుర సుందరి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొందూరు: నంద్యాల జిల్లాలోని శ్రీశైల దేవస్థాన సాంస్కృతిక వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలం



పొందూరు : ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న దేవస్థాన ప్రతినిధులు

లచ్చయ్యపేటకు చెందిన సనపల స్నేహాంజలి చేసిన భరతనాట్యం ఎంతగానో ఆకట్టుకుంది. దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో తన నృత్య ప్రదర్శనలతో మెప్పించిన స్నేహాంజలి ఇప్పుడు శ్రీశైలంలోని శైవక్షేత్రంలో కూడా అలరించింది. దీంతో ఆమె ప్రదర్శనను మెచ్చిన దేవస్థానం వారు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని కర్తలికి చెందిన బోర జోగమ్మ (73) ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగమ్మకు శ్యామలరావు, భాస్కరరావు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. భర్త చనిపోవడంతో జోగమ్మ ఇద్దరి కుమారుల వద్ద చెరో మూడు నెలల చొప్పున ఉంటోంది. కర్తలిలో ఉంటున్న చిన్న కుమారుడి వద్ద ప్రస్తుతం ఉంటున్న జోగమ్మకు చిన్న కోడలు సరస్వతితో శనివారం చిన్న వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో జోగమ్మ తీవ్ర మనస్తాపానికి గురైంది. శనివారం సాయంత్రం చిన్నకోడలు జోగమ్మకు టిఫిన్ అందించి, తన అమ్మవారింటికి వెళ్లింది. ఆదివారం ఉదయం సరస్వతి తన ఇంటికి వచ్చేసరికి జోగమ్మ ఇంటి దూలానికి చీరతో ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గమనించింది. సంఘటనపై మృతురాలి చెల్లెలు ఆబోతు తులసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు. మృతురాలి పెద్ద కుమారుడు మస్కట్ దేశంలో, చిన్న కుమారుడు దుబాయిలో వలస కూలీలుగా పని చేసుకుంటున్నారని తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

లావేరు: మండలంలోని బెజ్జిపురం గ్రామానికి చెందిన గురజాపు అప్పలనాయుడు (69) గడ్డిమందు తాగి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు అప్పలనాయుడు నిత్యం మద్యం సేవించి ఇంట్లో గొడవ చేస్తుండేవాడు. ఈ నెల 10న మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబీకులు ప్రశ్నించడంతో గొడవ జరిగింది. దీంతో ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేయడంతో వెంటనే కుటుంబీకులు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హెచ్‌సి లీలామోహన్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

కంచిలి: మండల పరిధిలోని బూరగాం జాతీయ రహదారి సమీపంలో మతి స్థిమితం లేని, గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యానికి గురై రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు కంచిలి ఎస్ఐ పారినాయుడు తెలిపారు. సుమారు 45 ఏళ్ల వయసు కలిగి, 5.3 అడుగుల ఎత్తుతో, చామన ఛాయ కలిగి ఉన్నాడని, నలుపు రంగు ఫ్యాంటు, ఎరుపు చారల టీ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే, 6309990866, 6309990819 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వ్యక్తికి రిమాండ్

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన అల్లుబోయిన ఢిల్లీశ్వరరావు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ ప్రజలకు భంగం కలిగిస్తూ అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ ప్రజలకు అసౌకర్యంగా ప్రవర్తించిన తీరుపై గతేడాది కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. అలాగే ఈ కేసుకు సంబంధించి కోర్టు నుంచి వచ్చిన సమన్లను పట్టించుకోకుండా కోర్టుకు హాజరుకానందున శనివారం రాత్రి జిల్లా కోర్టులో హాజరు పర్చగా ఢిల్లేశ్వరరావు తప్పును పరిగణనలోకి తీసుకొని జడ్జి ఏడురోజులు రిమాండ్ చేయడంతో ఢిల్లేశ్వరరావును అంపోలు జైల్‌కు తరలించడం జరిగిందని తెలిపారు.

కుక్కల దాడిలో దూడ మృతి


చనిపోయిన ఆవుదూడ

కవిటి: కుక్కల దాడికి మరో ఆవుదూడ బలైంది. మండలంలోని ప్రగడ పుట్టుగకు చెందిన బల్లెడ సాయిచంద్ ఇటీవలే పుట్టిన ఆవుదూడను తోటలో పశువుల కొట్టంలో ఉంచాడు. ఆదివారం మధ్యాహ్నం దూడపై దాడిచేసిన కుక్కలు దూడ పొట్టను పూర్తిగా కొరికేయడంతో దూడ చనిపోయింది. దీంతో కన్నీరుమున్నీరైన సాయిచంద్ ఇటీవల పదుల సంఖ్యలో మేకలు పశువులు కుక్కల దాడికి గురవుతున్నట్టు సాయిచంద్ వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారినుంచి పశువులు, మేకలు, మనుషులను రక్షించాలని వేడుకున్నాడు.

బాణసంచా షాపుల తనిఖీ

మెళియాపుట్టి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాలను టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణ మూర్తి ఆదివారం పరిశీలించారు. పటాకుల విక్రయా లు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా? లేవా? అనే అంశాలను పరిశీలించారు. ప్రజల భద్రత దృష్ట్యా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండా లన్నారు. షాపుల్లో నిబంధనల పాటింపు, భద్రతా చర్యల అమలు వంటి అంశాలను సమీక్షించారు. ఈయనతో పాటు తహశీల్దార్ బడే పాపారావు, డిటి రాము, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు ఉన్నారు.

మందుగుండు సామగ్రి పట్టివేత

పొందూరు: పొందూరు పట్టణంలోని మార్కెట్ వీధిలో ఆదివారం అనుమతులు లేకుండా మందుగుండ సామగ్రి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.1,09, 623ల విలువ గల మందుగుండు సామగ్రిని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో పొట్నూరు వెంకటరావు నుంచి రూ.40,088లు, జామి మణికంఠ నుంచి రూ.59,717లు, గుడ్ల రవి నుంచి రూ.9,818 విలువగల మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అలరించిన 'అజ్ఞాతవాసం' నాటిక

ఆమదాలవలస: నందీశ్వర ఉత్స వాల ముగింపు సందర్భంగా మున్సిపాలిటీలోని 4వ వార్డు గేదెలవానిపేటలో శనివారం రాత్రి ప్రదర్శించిన 'అజ్ఞాతవాసం' నాటిక ప్రేక్షకులను అలరించి ఆకట్టుకుంది. అహంకారం, ధనదర్పం కారణంగా భర్తకు విలువఇవ్వని ఒక స్త్రీ జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకొని కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావు రచించిన ఈ నాటికలో జీవన విలువలను ప్రతిబింభించే భావప్రదమైన సందేశం స్పురించిందని ప్రేక్షకులు కొనియాడారు. గతంలో పరిషత్ పోటీల్లో ప్రశంసలు పొందిన కళాకారులు శ్యామలరావు, విశ్వంత్ సాహితి రామారావు, విశ్వేశ్వరరావులు అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. కళాకారులను కమిటీ ఆర్గనైజర్ సాదు గణేష్ సత్కరించారు. నాటిక ప్రదర్శనకు నంది అవార్డు గ్రహీత లీలా మోహన్ సంగీతం ప్రత్యేక బలం చేకూర్చింది.

డిజెలకు అనుమతి తప్పనిసరి

కొత్తూరు : వివాహాలకు, ఇతర కార్యక్రమాలకు డిజెల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సిఐ చింతాడ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా డిజెలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిజె శబ్ధంతో గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు అవస్థలకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. అలాగే పురాతన, శిథిలావస్థలకు చేరిన భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలన్నారు.

ఆపదలో అండగా.. మది నిండుగా

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంకకు చెందిన బొర్ర వనజనాభం ఆరోగ్యం క్షీణించడంతో వెంటనే రక్తం ఎక్కించాలని వైద్యులు తెలిపారు. అదే సమయంలో బెలగాంకు చెందిన శకుంతల శస్త్ర చికిత్సకు రక్తం తప్పనిసరి అయ్యింది. ఇద్దరికీ అత్యవసర పరిస్థితుల్లో ఏ పాజిటివ్ రక్తం తప్పనిసరని వైద్యులు చెప్పడంతో బాధితుల కుటుంబ సభ్యులు రక్తం కోసం ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. చివరికి విషయం తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కాళీసాహు, సిసింద్రీ, నందీప్ లోళ్లపుట్టుగకు చెందిన లోళ్ల కళ్యాణ్, లోళ్ల అక్షిత్‌ను సంప్రదించారు. వీరిద్దరి వద్ద సేకరించిన ఎ పాజిటివ్ రక్తం రెండు నిండు ప్రాణాలకు ఊపిరి పోసి దైవం మనుష్య రూపేనా



కవిటి : రక్తదానం చేస్తున్న లోళ్ల అక్షిత్

అన్న సూక్తి నిజం చేసింది.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వృద్ధుడు అర్.జగన్నాథంకు అత్యవసరం రక్తస్రావంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న డొంకూరుకు చెందిన జన సైనికుడు చీకిటి కృష్ణయ్య రక్తదానం చేశారు. ఇదే విధంగా పలు సందర్భాల్లో అత్యవసర పరిస్థితుల్లో కృష్ణయ్య ముందుకొచ్చి రక్తదానం చేసి పలువురు చేత ప్రశంసలు అందుకున్నారు.

శిథిలావస్థలో పశుసంవర్ధకశాఖ కార్యాలయం

- మరుగుదొడ్లు లేక మహిళా సిబ్బంది ఇక్కట్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని పాతినవారివీధిలో ఉన్న పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం శిధిలస్థితికి చేరుకొని కుప్పకూలే దిశగా ఉండడంతో దినదిన గండంగా అక్కడి పశువైద్య సిబ్బంది కాలం వెల్లదీస్తున్నారు. పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురించినప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడం విశేషం. చిన్న ఇరుకు గదుల్లో సిబ్బంది కాలం వెళ్లదీస్తూ ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని బిక్కుబిక్కుమంటూ పశు వైద్యాధి కారులు, సిబ్బంది కాలం గడుపుతున్నారు. పశువైద్య ఎడి కార్యాలయంలో అత్యధికంగా మహిళలే విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయ ప్రాంగణంలో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుకు పోవాలంటే చుట్టుపక్కల ఉన్న ఎవరో ఒకరి ఇంటికి వెళ్లి వారి అనుమతితో వారి మరుగు దొడ్లకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. మూగ జీవాలకు సేవలు అందించే సిబ్బందికి కనీసం మరుగు తీర్చుకునే వెసులుబాటు కూడా లేకపోవడం దురదృష్ట కరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బంది ప్రతిరోజూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీప ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మహిళా


శిథిలావస్థలో ఉన్న ప్రాంతీయ పశువైద్య కార్యాలయం

ఉద్యోగుల బాధలు నిత్యకృత్యంగా మారాయి. బడ్జెట్ కేటాయింపుల్లో పశు సంవర్ధక శాఖకు నిధులు వచ్చినప్పటికీ వాటిని ప్రాధాన్యత క్రమంలో వినియోగించడం లేదని పలువురు వాపోతున్నారు. మహిళా సిబ్బందికి అనుకూలమైన వాతావరణం కార్యాలయ ఆవరణలో లేకపోవడం వలన విధుల్లో ఇబ్బందులు పడుతున్నారని పాడి రైతులు చెబుతున్నారు. పురాతన కాలం నాటి పశువైద్య కార్యాలయంతో ఉద్యోగులే కాకుండా పశువులను చికిత్స కోసం తీసుకువచ్చే పాడి రైతులకు కూడా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు, పాడి రైతుల సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రాథమిక వసతులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.